


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

తన మీదకి తుపాకి గురిపెట్టిన లాయర్ ని చూసి ఆశ్చర్యంగా అడిగాడు ఒకడు.

“నన్నెందుకు చంపాలనుకుంటున్నావు? మనిద్దరి మధ్యా శతృత్వం లేదుగా?”

“లేదు.. కానీ నీకు, సుబ్బారావుకి మధ్యగల శతృత్వం గుర్తుందా?”

“ఉంది కానీ.. అతడు మరణించాడుగా!?”

“అవును. నేనతని విల్లులో మొదటి క్లాజ్ ని అమలుపరచడానికి వచ్చాను..”

జవాబు చెప్పాడు లాయర్.

★★★★

# చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ఒరేయ్ కిట్టూ మీ ఇంట్లో యేంట్రా ఆ చప్పుడు?" అనడిగింది పక్కింటామె కిట్టూను పక్కకు పిల్చి కుతూహలంగా.

"మా అమ్మ మా నాన్న షర్టును బండకేసి బాదుతోందిలే. అదీ ఆ చప్పుడు" అన్నాడు కిట్టూ.

"దానికంత పెద్ద శబ్దం ఏమిట్రా?" అందామె అనుమానంగా.

"మరి ఆ షర్టులో మా నాన్న కూడా వున్నాడుగా" అన్నాడు కిట్టూ ఆమె ఇచ్చిన చాక్లెట్టు చప్పరిస్తూ.

***

కొత్తగా వేట నేర్చుకుంటున్న చినబాబు పెద్ద వేటగాడైన పెదబాబును కలిశాడు.

"చూడండి. రాత్రిపూట వేటకు వెళ్ళేటప్పుడు టార్చిలైటు తీసుకుని వెళితే పులులు, సింహాలు మనల్నేమీ చెయ్యవటగదా? మొన్నొకసారి పేపర్లో చదివాను" అన్నాడు చినబాబు.

"అదంతా నువ్వు టార్చిలైటు వెనక్కి చూపుతూ ఎంత వేగంగా పరుగెత్తగలవనే దాన్ని బట్టి వుంటుంది" అన్నాడా అనుభవశాలి పెదబాబు.

***

ఇద్దరు స్నేహితురాళ్ళు ఒక పార్టీలో కలుసుకున్నారు.

"ఏమే ఈ మధ్య ఆ కార్లో తిరిగే కనకారావుతో తిరుగుతున్నట్లు లేదేం?"

"అవును. ఆయన్ని వదిలేశాను"

"ఎందుకని?"

"అది ఆయనది కాదట. ఆయన పనిచేసే కంపెనీ మేనేజరుదట. ఆయన దానికి డ్రైవరట"

***

"మీ ఆఫీసరు గున్నేశ్వరరావుతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలోయ్. ఎప్పుడయితే బాగుంటుందంటావ్?"

"ఆయనతో మాట్లాడ్డం చాలా కష్టమే"

"ఏం?"
"లంచ్‌కి ముందేమో కోపంతో వుంటాడు. కారణం ఆకలి. లంచ్ తర్వాతేమో మాట్లాడలేదు. కారణం భుక్తాయాసం."

***

హోటల్లో దర్జాగా టిఫిన్ తిని, కాఫీ తాగిన ఆనందరావు మొహం సర్వరు తెచ్చిచ్చిన బిల్లు చూసేసరికి మాడిపోయింది.
"ఏమయ్యా సర్వరూ! నేను తిన్నది, తాగింది మూడు రూపాయలదే అయితే బిల్లు అయిదు రూపాయలు వేశావ్?" అన్నాడు దబాయింపుగా.
"ఆ మిగతా రెండు రూపాయలు మీరు ఆ కుర్చీలో పడున్న న్యూస్ పేపరు చించి పొట్లాం కట్టుకుని జేబులో వేసుకున్న చక్కెరకు" అన్నాడు సర్వరు.

***

"ప్రస్తుతం నేను కృష్ణని ప్రేమిస్తున్నాను. అందుకని నువ్వు నీ ప్రేమకానుకగ యిచ్చిన ఈ ఉంగరం తీసేసుకో" అంది లలిత ఉంగరం రిటన్ చేస్తూ.
"మంచిది. మరి నువ్విప్పుడు ప్రేమిస్తున్న కృష్ణ యెక్కడుంటాడో కాస్త చెపుతావా?" అనడిగాడు మురళి.
"ఎందుకూ? మా ప్రేమ చెడగొట్టడానికా?"
"అబ్బే అదేం కాదు. అతనికి థాంక్స్ చెప్పుకుని ఈ ఉంగరం అతనికే అమ్మేద్దామని."

***

"ఈ సంగతి విన్నావటోయ్? మన వీధి ఆ చివరనున్న సుధాకర్, ఇదే వీధిలో ఈ చివర్న వుంటున్న సునంద ప్రేమించుకుని పెళ్ళికూడా చేసుకోబోతున్నారట" అన్నాడు సుభద్రమ్మ మొగుడు.
"అలాగా! వినలేదు. నా భార్య ఊళ్ళో లేదులే" అన్నాడు సావిత్రమ్మ మొగుడు.

***

ఓ వ్యక్తి హడావుడిగా ఒక కుక్కను పట్టుకొచ్చాడు డాక్టర్ దగ్గరకు. వచ్చీ రావడంతోటే "డాక్టర్ ఈ కుక్క నా భార్యను కరిచింది. కానీ పెద్ద గాట్లేమీ పడలేదు" అన్నాడు.
"అయితే నన్నేం చెయ్యమంటావయ్యా?" విసుగ్గా అన్నాడు డాక్టర్.
"ఏం లేదు. దీని పళ్ళకి బాగా పదును పెట్టండి చాలు" అన్నాడాయన.

***

" వియత్నాం దేశంలో నూరు రకాల పాములున్నాయట. వాటిల్లో తొంభై తొమంది విష సర్పాలంట" అన్నాడు జనరల్ నాలెడ్జి జగన్నాధం.

"అంటే ఆ దేశంలో విషంలేని పాము ఒక్కటేనన్నమాట వుంది" అన్నాడు పాములంటే భయం వున్న సోమనాధం.

"అవుననుకో. కానీ అది మనిషిని అమాంతం మింగేస్తుందట"

" ఏంటయ్యా! నేను నీకు డజను కమలా పండ్లు పంపమంటే పదే పంపావు. డబ్బులేమో డజను పండ్లకు తీసుకున్నావు" అంది కమలమ్మ కోపంగా పండ్ల కొట్టతనితో.

"ఏం లేదమ్మా మేం మీకు పంపబోయిన డజను పండ్లలో రెండు బాగా చెడిపోయాయి. మీకు శ్రమ లేకుండా మేమే వాటిని పారవేశాం."

COMMENTS